

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

ఆదివారం,30 నవంబర్ 2025

8 పేజీలు


## 1న ఉంగుటూరు మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన



**-ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ**

**- పార్టీ క్యాడర్‌తో సమావేశం**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1వ తేదీన ఏలూరు జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. డిసెంబర్,1వతేదీ ఉదయం 10.30ని.లకు తాడేపల్లి మండలం ఉండవల్లి నుండిహెలికాప్టర్‌లో బయలు దేరి, 10.55 ని.లకు ఉంగుటూరు మండలం గొల్లగూడెం చేరుకొని, ప్రజాప్రనిధులు, అధికారులను కలుసుకుంటారు.11.10 ని.లకు గొల్లగూడెం నుండి బయలుదేరి ఉంగుటూరు

- తరువాయి 2లో..

## టీడీపీ తాపత్రయం!

- అధికారంలో ఉన్నా ముందు జాగ్రత్త
- ఎమ్మెల్యేలకు పనులు మీద పనులు
- క్యాడర్‌లో అసంతృప్తి తగ్గేలా..త్వరలో శిక్షణ
- జిల్లా అధ్యక్షులు వచ్చే స్తున్నారు



**ఏలూరు,సూర్యప్రతినిధి:** తెలుగుదేశం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడాపూర్తిపట్టుకు ప్రయాత్నాలు ఆరంభించింది. వచ్చే వారంలోపు పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం, డిసెంబర్ మొదటి వారంలో క్యాడర్‌కు శిక్షణ, ఈలోపు చిన్నచితక పదవులు సైతం భర్తీ చేయబోతున్నారు. పల్లె నుంచి పట్నం వరకు పార్టీ లో జోష్ నిలపాలని భావిస్తోంది.

ఇదే క్రమంలో వైసీపీ కొన్ని చోట్ల ఇంకా బలంగానే ఉన్నవిషయాన్ని,ఏమాత్రం ఏమరుపాటు తాగదని క్యాడర్ ఇంకోవైపు సూచిస్తుంది.అలాగే ఎమ్మెల్యేలకు పని భారం పెంచారు.

**- జాబితా రెడీ ?** -పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుల జాబితా సిద్ధం అవుతుంది. ఇప్పటికే మూడు నెలలుగా అధ్యక్షుల ఎంపికైన సుదీర్ఘ కసారత్తు సాగింది.ఈ క్రమంలో ఐవిఆర్ ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ జరిగింది.చాలా కాలం పాటుఅధ్యక్షులుగా గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటిచంటిలో ఒకరికి అవకాశం.సామాజిక నేపథ్యంలో ఎంపిక జరగబోతున్నదని అంచనా వేస్తున్నారు.ఇదే అంశంపై సీఎం చంద్రబాబు సైతం ఒక నిర్ణయంకు వచ్చారు. ఈసారికూడాగన్ని వీరాంజనేయులుకే తిరిగి అవకాశం ఉన్నట్టు పార్టీలో చర్చ సాగుతుంది.ఆప్కాబ్ చైర్మన్‌గా ఉన్న కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారు. అయితే ఇంకోవైపు ఎమ్మెల్యే చంటికి ఛాన్స్ కనిపిస్తుంది. తూర్పు గోదావరి తో పాటు మరో రెండు జిల్లాల నుంచి ఒకే సామాజిక వర్గం నుంచి కొంత వెసులు బాటు కల్పిస్తే ఎమ్మెల్యేచంటి ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలోను టెన్షన్ ఉంది.మంతెన రామరాజు పేరు ప్రముఖంగా వినిపిస్తుంది.

ఎక్కువకాలం దీనిని నాన్చడం ఎంత మాత్రం మంచిది కాదని ఇప్పటికే జిల్లాల్లో సీనియర్‌లు భావిస్తున్నారు. వారంలోపు అధ్యక్షుల నియామకం జరగ నుందిని సంకేతం.

**- క్యాడర్‌కు శిక్షణ** -టీడీపీ క్యాడర్‌ను మరింతబలంగా తీర్చిదిద్దేందుకు వచ్చే నెల లో శిక్షణ ఇవ్వాలని ఇప్పటికే

- తరువాయి 2లో..

## జగన్ పాలనలో విధ్వంసమే తప్ప
# అర్ధ రూపాయి అభివృద్ధి లేదు

**- పలు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు**





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** జగన్ పాలనలో విధ్వంసం ,ధ్వంసం తప్ప అర్ధ రూపాయి అభివృద్ధికి నోచుకోలేదని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.పాలకొల్లులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయనకూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో 34లక్షలతో నిర్మించనున్న బాలికల హాలు, టాయిలెట్స్ నిర్మాణ పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు.రూ 1కోటి 50లక్షలతో నిర్మిస్తున్న వేణుమాధవ్ సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ స్థలాల్లో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు.ఈసందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలన చెత్తగా సాగిందని, పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్ను, కులాయి పనులతో పాటు చెత్త మీద కూడా పన్ను వేసి ప్రజలపై భారం మోపిందన్నారు.మున్సిపాలిటీ నిధులను సైతం పక్కదోవ పట్టించి అభివృద్ధిని అడ్డుకుందని తెలిపారు.

- తరువాయి 2లో..

## నేటి సాయంత్రానికి సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

- పర్యటనకు వచ్చి,తిరిగి వెళ్ళేవరకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పి,సిఎం కార్యాలయ అధికార్లుతో పనులు పరిశీలన



**ఉంగుటూరుమేజర్‌న్యూస్ :** ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను శనివారం సాయత్రం జిల్లా ఎస్సీ కె.ప్రతాప్‌శివకిషోర్,ముఖ్యమంత్రి కార్యాలయ

- తరువాయి 2లో..

## యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- జాబ్ మేళాలో 600 మందికి పైగా ఉద్యోగాలు
- కేంద్ర మంత్రి వర్మ,ఎమ్మెల్యే అంజిబాబు,డిప్యూటి స్పీకర్ రఘురామ,కలెక్టర్ నాగరాణి





**భీమవరం,మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పలు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరావు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళలో ఉద్యోగాలు పొందిన వారికీ అపాయింట్మెంట్ లెటర్స్‌ను కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ,భీమవరం ఎమ్మెల్యే పులపర్తి

- తరువాయి 2లో..

## ఐక్యతతోనే జాతుల అభివృద్ధి

శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు

- మాలలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర : మాజీ ఎంపీ హర్ష కుమార్
- అట్టహాసంగా మాలల ఆత్మీయ సమారాధన







**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్:** జాతి ప్రజల మధ్య ఐక్యత ముఖ్యమని, అందరూ ఐక్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు.శనివారం మండలంలోని సీతారాంపురంలో గల జేబీరా విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాలల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- తరువాయి 2లో..

# భారీ వర్షాల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

**: ఎమ్మార్వో జి.అనిత కుమారి**



**పెనుగొండ, మేజర్‌న్యూస్:** రైతులు, మత్స్యకారులు, ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని శనివారం పెనుగొండ తహసిల్దార్ జి. అనిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామస్థాయి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకుని, భద్రపరుచుకోవాలని, కల్లాలపై ఆరబెట్టిన ధాన్యాన్ని కప్పుకోవడానికి అవసరమైన బలకాలు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైతే సమీపంలోని రక్షణ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతర పర్యవేక్షణలో ఉండాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## దేవ గ్రామంలో కుక్కల స్వైర విహారం



**పెనుగొండ, మేజర్ న్యూస్:**దేవ గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. పిల్లలు, మూగజీవాలపై దాడికి తెగబడుతున్నాయి. దేవ గ్రామంలో ఆరుగురు వ్యక్తులను కుక్కలు కరవడంతో గ్రామస్తులు గ్రామ సర్పంచ్ ,కార్యదర్శికి వినతిపత్రం అందించారు. దాడిలో గాయపడిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. క్షణక్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సమాచార హక్కు చట్టంపై పబ్లిక్ హెల్త్ ఉద్యోగుల ర్యాలీ




ఏలూరు, మేజర్ న్యూస్: ఏలూరు పబ్లిక్ హెల్త్ డివిజన్ పౌర సమాచార అధికారి నేతల విజయ చంద్ర, అప్పిలేట్ అధికారి కె.ఫణి భూషణరావు, వి.బి.వి.ఆర్. సుధాకర్, ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005 20వ వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ డివిజన్, సబ్ డివిజన్ ఏలూరు ఉద్యోగులు " తెలుసుకోవడం మీ హక్కు తెలియచేయడం ప్రభుత్వ బాధ్యత " అనే నినాదంతో పబ్లిక్ హెల్త్ డివిజన్ కార్యాలయం నుండి ఉద్యోగులు బయలుదేరి గులాబీ తోట మీదగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

# నేటి సాయంత్రానికి సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

**మొదటిపేజి తరువాయి**

అధికారులు, సంబం ధిత అధికారులులతో కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పరిశీలిం చారు. గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక ,కేడరు సమావేశ సభాస్థలి, గోపినాథపట్నంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు లబ్ధిదారులుగృహాలను,తదితర ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిసెంబరు 1వ తేదీన సోమవారం ఉంగుటూరు మండలం పర్యటన ఖరారు అయిన నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లును ఆదివారం సాయంత్రానికి పూర్తిచేస్తామని అన్నారు. గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక ,కేడర్ సమావేశ సభాస్థలి, గోపినాథ పట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లు పంపిణీ,లబ్ధిదారులు గృహాలు, తదితర ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు.

ఏక్కడ ఏఒక్క చిన్న పొరపాటు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల అధికారులు కేటాయించిన పనులు పూర్తి చెయ్యుటలో నిమగ్నమై ఉన్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివారం సాయంత్రానికి పూర్తి చెయ్యాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు.జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అసాధారణ భద్రతా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామన్నారు.

హెలిప్యాడ్, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ గృహాలు, ప్రజావేదిక,తదితర ప్రాంతాలు, ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలకు, కాన్వాయ్ మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి జల్లెడ పట్టామని అన్నారు. పర్యటనలో ఏటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లును కట్టుదిట్టం చేశామని అన్నారు. పర్యటన పూర్తయ్యేంత వరకు నిరంతరం భద్రతా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.జిల్లా కలెక్టరు వెంట జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఏఎస్పీలు నక్కా పూర్ణచ ంద్రరావు, ఆర్.సుస్మిత,ఏలూరు ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్,డిఎస్పీలు, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే జాతుల అభివృద్ధి

**మొదటిపేజి తరువాయి**

సీతారాంపురం సర్పంచ్ దొండపాటి వెంకట్ అతిథులను వేదిక పైకి ఆహ్వానించగా, ఎంపీపీ మైలా బత్తుల సోనీ అధ్యక్షత వహించారు. ఈ సభలో మోసేన్ రాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నా జాతి ప్రజలంతా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని కోరుకున్నారని, అంబేద్కర్ ఆశయాలు నెరవేరాలంటే అందరూ ఐక్యంగా ఉండి అందరూ చదువుకుని అభివృద్ధి కావాలన్నారు. మరో అతిథిగా విచ్చేసిన రాజమండ్రి మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ మాట్లాడుతూ మాలలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని, దీనిలో భాగంగానే వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చాయని అన్నారు. సమస్య మన వరకు వచ్చినప్పుడు ఏమీ అవ్వదులే అని కూర్చుంటే తీవ్ర నష్టం జరుగుతుందని ఇప్పటికైనా సమస్యలపై ముందుకు కదలాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని,రాజ్యాంగేతర శక్తిగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి అన్నారు. గతంలో పోల్చుకుంటే మాల జాతిలో ఎక్కువమంది చదువుకున్నారని రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు,రాజ్యాంగాన్ని రక్షించేందుకు యువత ముందుకు రావాలన్నారు. భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాయలేదని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిని అందరూ తిప్పి కొట్టాలన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, ఉప్పులేటి దేవి ప్రసాద్, హైకోర్టు న్యాయవాది గోడ రాజబాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, గుమ్మాపు సూర్య వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నుండి పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా హాజరయ్యారు. మాజీ మంత్రి పీతల సుజాతకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక కన్వీనర్ సోద దాసి శ్రీధర్, కాకిలేటి ఆనంద్ కుమార్, ఇంజే టి జాన్ కెనడి, దొండపాటి స్వాములు, హేస్లీ, వర్ధనపు యేసు రత్నం, జిల్లెల్ల దిలీప్ కుమార్,రుస్తుం బాధ సర్పంచ్ బందెల భారతీ రవీంద్ర, కొప్పర్రు, మల్లవరం సర్పంచ్ లు నల్లి వరలక్ష్మి, సంది సుజాత, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# 1న ఉంగుటూరు మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన

**మొదటిపేజి తరువాయి**

మండలం గోపీనాథపట్నం చేరుకొని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసి, ఆయా కుటుంబాలతో మాట్లాడి,వారిసమస్యలను అడిగి తెలుసుకుంటారు. 11.40 ని.లకు గోపీనాథపట్నం నుండి బయలుదేరి, నల్లమాడ చెరుకుని ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నల్లమాడ నుండి బయలుదేరి, 2.5 ని.లకు గొల్లగూడెం చేరుకొని క్యాడర్ మీటింగ్‌లో పాల్గొంటారు. అనంతరం 3. 35 ని.లకు గొల్లగూడెం నుండి బయలుదేరి 3.40 ని.లకు హెలిపాడ్ చేరుకుంటారు. 3.45 ని.లకు గొల్లగూడెం నుండి హెలికాప్టర్‌లో ఉండవల్లి బయలుదేరివెళతారు.

# టీడీపీ తాపత్రయం!

**మొదటిపేజి తరువాయి**

నిర్ణయించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికీ క్యాడర్‌ను సిద్ధం చేయడానికే ఇదంతా అని భావిస్తున్నారు. ఇప్పటికే పార్టీలో వివిధ పదవులు పొందిన వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అక్కడ నుంచి రంగం అరంభమైంది. ఆ తరువాత రైతుల మద్దతుకూడకట్టు కట్టు కోవడానికి మీకోసం పేరిట ఎమ్మెల్యే లు రైతుల వద్దకు వెళ్లేలా వారం పాటు ప్రత్యేక కార్యక్రమం ఇప్పటికే అమలు లో ఉంది. దీనికి తోడు నియోజక వర్గాలలో ఆశించిన స్థాయిలో పనులు కావడం లేదని పార్టీ లో కొంత అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యే లో కూడా ఇలాంటి పరిస్థితి ఉన్న బైట పడటం లేదు. చాలా హామీ లు స్థానికం గా పెండింగ్ లో ఉండనే ఉన్నాయి. అయితే మంత్రి లోకేష్ కొన్నింటిని సరిదిద్దు తున్న ట్టు చెబుతున్నారు. ఇంకోవైపు వైసీపీ నేరుగా కొన్ని నియోజకవర్గాలలో పరిధిలో ఇప్పటికి బలం గానే ఉందనే విషయాన్ని విస్మరించకుండా.. పార్టీ అసలు విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఇంకొందరు సూచనలు చేస్తున్నారు.

### జగన్ పాలనలో విధ్వంసమే తప్ప అర్ధ రూపాయి అభివృద్ధి లేదు

**మొదటిపేజి తరువాయి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త మీద పనులు రద్దు చేయడంతో పాటు పట్టణాల సమగ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. పాలకొల్లు పట్టణంలో దీర్ఘకాలిక డంపింగ్ యార్డ్ సమస్య శాశ్వతంగా తీర్చేలా ప్రత్యేక దృష్టి సాధించానని, అందులో భాగంగా చెత్త కనుమరుగయ్యే పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిచ్చెట్టి బాబు గండేటి వెంకటేశ్వరరావు దనాని సూర్యప్రకాష్ గాది చిన్న వెంకన్న బిరుదుకోట సోమశేఖర్ మల్లంపల్లి పకీర్ బాబు ముప్పిరి సత్యనారాయణ బోనం నరసయ్య ఉన్నమట్ల కపర్ది కొల్లికొండ కుమార్ బిడ్డ లక్ష్మీనారాయణ గాది సుబ్బారావు బుగ్గే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

**మొదటిపేజి తరువాయి**

రామాంజనేయులు, డిప్యూటి స్పీకర్‌కనుమూరి రఘురామ కృష్ణంరాజు,కలెక్టర్ చదలవాడ నాగరాణి అందించారు. కేంద్రమంత్రి వర్మ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో అనకాపల్లి రామాయపట్టణం ప్రాంతాల్లో ఏర్పాటు కాబోయే పరిశ్రమల్లో లక్ష40 వేల ఉద్యోగాలకు అవకాశం ఉందని, ఈ విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాయన్నారు. ఈ జాబ్ మేళాకు 2,600 మంది రిజిస్ట్రేషన్ అవ్వటం చాలా గొప్ప విషయమని, ఇటువంటి జాబ్ మేళాలు మరిన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థులు మొదటిగా చిన్న ఉద్యోగమైనా పెద్ద ఉద్యోగమైన చేరి తర్వాత తనఅనుభవంతో పెద్ద ఉద్యోగాల వైపు వెళ్లాలన్నారు. డిప్యూటీస్పీకర్ కనుమూరి రఘురామకృష్ణమరాజు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలతో ఎంఓయూ కుదుర్చుకున్నదని అన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జాబ్ మేళాలో 600 పైగా ఉద్యోగాలు పొందారని, మరికొన్ని ఉద్యోగాలకు సెకండ్ ఇంటర్వ్యూ అనంతరం మరొక 400 మంది ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు,కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిషాంత వర్మ, డైరెక్టర్ డా జగపతి రాజు, ప్రిన్సిపల్ డా మురళీకృష్ణంరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దిలీప్ చక్రవర్తి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డా పి లోకమాన్ తదితరులు పాల్గొన్నారు.

# పారిజాతగిరికి కంకణ ధారణతో,కాలినడకన కొండపైకి వచ్చిన చైర్మన్,సభ్యులు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు స్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువ జామున 4.30 నిమిషాలకు సుప్రభాత సేవ తోమాల సేవ ఆరాధన తీర్థ ప్రసాద గోష్టి అనంతరం భక్తులకి స్వామివారు విశేషమైన అలంకరణలో దర్శనం కల్పించారు. ఉదయం 6 గంటలకి గిరిప్రదక్షిణ కంకణ ధారణతో భక్తులతో పాటు ఆలయ టెస్ట్ బోర్డ్ చైర్మన్,సభ్యులు కాలినడకన కొండపైకి చేరుకుని ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు అష్టోత్తర పూజలు జరిపించుకొని శ్రీస్వామి వారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ ని తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం సుందర్ శేషుకి ఆలయ మర్యాదలతో ఆలయ కార్య నిర్వహణ అధికారి కలగల శ్రీనివాసు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు పూజ ఏర్పాట్లు చేసి శ్రీ స్వామి వారి శేష వస్త్రాలు స్వామివారి ప్రసాదాలతో సన్మానించారు, జబర్దస్త్ నటుడు అప్పారావు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు ఆలయ చైర్మన్ అల్లూరి రామకృష్ణ కన్నా కృష్ణ కొప్పుల నాగ సురేంద్ర ముప్పిడి భాను విష్ణు ఆరేపల్లి నాని దివ్య ప్రసన్న వీరికి, ఈరోజు అన్నదాతలు ఆర్డిఓ రవి గోపాల్ ,ఆర్టిఓ మేడూరి వెంకట సుబ్రహ్మణ్యం జంగారెడ్డిగూడెంవీరికి అర్చకులు రవికుమార్ఆచార్యులు, ఋషి కేష్, కుమార్, రాఘవ ఆచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారి శేషా వస్త్రాలు,శ్రీ స్వామివారి ప్రసాదాలతో వేద ఆశీస్సులతో సన్మానించారు, కొయ్యలగూడెం చెందిన భక్తురాలు శ్రీ స్వామివారికి 1,116లో గోవింద నామాలతో కాగితాల పూలమాల కట్టి స్వామివారికి సమర్పించుకున్నారు రాజమండ్రికి చెందిన చేబోలు అన్నసూయ ఓ భక్తురాలు వీణానాదం చేసిన్నారు.ఆలయానికి ఆదాయం పూజ టికెట్లు ద్వారా ప్రసాదాల ద్వారా విరాళాల ద్వారా సుమారుగా 80వేల రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యానివాహణాధికారి కలగర శ్రీనివాసు తెలిపారు.

## తాడిచర్ల ధ్వజస్తంభానికి ఇత్తడి మేఘం,శిఖరం



**కామవరపుకోట, మేజర్‌న్యూస్:** మండలంలోని తాడిచర్ల శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శనివారం ధ్వజ స్తంభానికి ఇత్తడి మేఘాలు, శిఖరం ఏర్పాటు, సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం మండపారాధనలు, పంచామృత అభిషేకం, వాస్తు పూజ వాస్తు హెూమం, నీరాజనం మంత్రపుష్పములు నిర్వహించారు. ఇమ్మడి సత్యనారాయణ – శ్రీదేవి దంపతులు పీటల మీద కూర్చుని పూజలు నిర్వహించారు. ఇమ్మడి వీరభద్ర స్వామి, ఇమ్మడి మాణిక్యాలరావు, ఇమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కామవరపుకోట లలితా శ్రీ పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం దుర్గ బాబు వారి శిష్య బృందం నిర్వహించారు.

# రోగి మృతి - ఆశ్రం ఆసుపత్రి ఎదుట అర్ధరాత్రి బంధువుల ఆందోళన



**భీమడోలు,మేజర్ న్యూస్ :** 15 రోజుల క్రితం ఆశ్రం హాస్పిటల్‌లో భీమడోలు మండలానికి చెందిన తంబి (47) బైపాస్ సర్జరీ చేయింకున్నాడు. నాలుగు రోజుల క్రితం తిరిగి అస్వస్థతకు గురయ్యాడు. 4 రోజుల నుండి ఆశ్రం వైద్యులు అతనికి వైద్యం అందించారు. శుక్రవారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆశ్రం ఆసుపత్రి వైద్యులు శుక్రవారం రాత్రి తంబిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించాలని సూచించారు. కానీ అతను మార్గమధ్యంలో మృతి చెందాడు. తంబి మృతదేహంతో తమకున్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆశ్రం ఆసుపత్రి వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులు వారికి సర్ది చెప్పి ఆందోళన విరమింప చేశారు.

## బైబిల్ చేతి రాత పోటీల విజేతలకు బహుమతులు



**యలమంచిలి, మేజర్ న్యూస్:** ఇటీవల మండలం లోని కాజ (పడమర) గ్రామంలో సభల కన్వీనర్ కడలి మధు ఆధ్వర్యంలో పరిశుద్ధాత్మ సువార్త సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘంలో పరిశుద్ధ బైబిల్ గ్రంధాన్ని చేతితో రాసే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన కడలి జెర్మియ, కడలి జాన్ దేవదాస్,కడలి దేదీప్య, గుబ్బల నాగవాణి, కడలి చిన్న, కడలి జాన్ దేవదాస్ లకు దైవజనులు అపోస్తులు ఉజ్జీవ ప్రసంగికులు జయరాజ్ ( నిర్మల్) బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుద్ధ బైబిల్ గ్రంథమునురాయడంఅంత సామాన్య విషయం కాదన్నారు. బైబిల్ రాసిన వారిని ప్రోత్సహించి బహుమతులు అందిస్తున్న సభల కన్వీనర్ మధును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యేసు కృపా సువార్త సంఘాల అధ్యక్షులు విప్పర్తి రామారావు,దైవజనులు వీ.జీ రాజు,వీకె.దాస్. కలిగిత పౌల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమద్దిలో పంచామృత అభిషేకం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గుర్వాయిగూడెం గ్రామం నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానం నందు ఉదయం గం.8ల నుండి ఆలయ ముఖ మండపం నందు పంచామృత అభిషేకం ఆలయ అర్చకులు,వేద పండితులు, ఆద్వర్యంలో జరుపబడినది. ఈ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనినారు. శనివారం మద్యాహ్నం గం.3.30 లవరకు శ్రీ స్వామి వారి ఆలయమునకు వివిధ సేవల రూపేణా రూ. 1,30,848లు సమకూరింది. శ్రీ స్వామి వారికి స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు సుమారు 1650 మంది భక్తులకు అన్నదానం చేసారు. స్వామి వారి దర్శనంనకు విచ్చేసిన ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనరు, కార్య నిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెలిపారు.

# పెయింటర్స్,ఆర్టిస్ట్ అసోసియేషన్‌కి ఇటుకలు వితరణ



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** యడ్ల గణేశ్వర రావు సేవ ఫౌండేషన్ ద్వారా పాలకొల్లు పెయింట్ అండ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ వారికి కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం ఫౌండేషన్ ద్వారా 3 వేల ఇటుకలు వితరణ అందించారు,సామాన్యులకు ఈ కళ్యాణ మండపం ఎంతగానో ఉపయోగ పడుతుంది, దీని ద్వారా పెయింటర్స్ అసోసియేషన్ సంఘ సభ్యులకు వెల్ఫేర్. ద్వారా ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని తాతాజీ అన్నారు, ఈ కార్యక్రమంలో పెయింట్ అసోసియేషన్ అధ్యక్షులు నీలం రవికుమార్ గౌరవ అధ్యక్షులు కోరుకొండ సుబ్బారావు కార్యదర్శి అధికారి పవన్ కుమార్ కోశాధికారి బొప్పే దుర్గాప్రసాద్ షణ్ముఖరావు ఆర్గనైజింగ్ సెక్రటరీ చలపతి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు,

# 10 విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన ప్రశ్నావళి పంపిణీ



**యలమంచిలి, మేజర్ న్యూస్:** మండలంలోని శ్రీ పింగళి వెంకయ్య జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు శనివారం యుటిఎఫ్ రూపొందించిన పరీక్ష ప్రశ్నావళి ఉచితంగా పంపిణీ చేశారు.

విద్యా దాతలు కొప్పిరిడి సర్వేశ్వరరావు,గోటేటి రామలింగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్ఎం మహమ్మద్ లియాఖత్ అధ్యక్షున జరిగిన సభలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని యుటిఎఫ్ పొందు కుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల నిరసన





**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం వాడిగా,వేడిగా జరిగింది. సమావేశంకు చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. వైసిపి కౌన్సిలర్లు వైస్ – చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ఆధ్వర్యంలో ప్రభుత్వం సీజ్ చేసిన రూ 8.5 కోట్లు మున్సిపల్ సాధారణ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

సమావేశంకు వైసిపి కౌన్సిలర్లు ప్ల కార్డులతో నినాదాలు చేస్తూ సమావేశం మందిరంలోకి ప్రవేశించి,నిరసన వ్యక్తం చేశారు.

వైస్ – చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు పలువురు వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ నిధులు నిలిపివేయడం వలన పట్టణంలో అభివృద్ధి పనులు ఆగిపోయాయని ఆరోపించారు.

వెంటనే సీజ్ చేసిన నిధులు తిరిగి మునిసిపాలిటీకి జమ అయ్యే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

కమిషనర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ వైసీపీ కౌన్సిలర్లు చేపట్టిన ఆందోళన నిరసన ప్రభుత్వానికి తెలియ పరుస్తానన్నారు. సమావేశంలో ఎజెండాలోని 186 అంశాలను ఆమోదించారు.

# వైసీపీ మండల యువజన అధ్యక్షుడుగా నవీన్ వర్మ



**కుకునూర్. మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్సిపి కుక్కు నూరు మండల యువజన అధ్యక్షుడిగా చేకురి నవీన్ వర్మను ఆ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శనివారం ప్రకటించడం జరిగింది ఈ సందర్భాగా నవీన్ వర్మ మాట్లాడుతూ, నన్ను యువజన విభాగ అధ్యక్షులుగా నామీద నమ్మకం ఉంచి నన్ను ఎంపిక చేసినందుకు, నా బాధ్యతని సక్రమంగా నిర్వహిస్తాను అని , మండలంలో ఉన్న యువతని అంత ఏకతాటిపై నడిపించి పార్టీ గెలుపుకు నా వంతు కృషి చేస్తా అని వారు తెలియచేసారు, అనంతరం పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ తెల్లం బాలరాజు కి, కుక్కునూరు మండల పార్టీ అధ్యక్షులు తాండ్ర రాజేష్ కి ధన్యవాదములు తెలియచేసారు.

# దాతృత్వం చాటుకున్న కూరం ప్రసాద్ : ఆశ్రమం షెడ్‌కు రేకులు వితరణ



– కుమార్తె పుట్టినరోజు వృద్ధులు దివ్యాంగు లకు పండ్లు,స్వీట్స్ పంపిణీ

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్** : కుటుంబంలో ఎవరిదైనా పుట్టినరోజు జరుపుకోవాలని అనుకుంటే చుట్టాలతోఇంటివద్దగాని, హొటల్లో ఫంక్షన్ గాగానీ పంచపక్ష పరమాన్నాలు వండుకుని ఆరగిస్తారు. చుట్టుపక్కల వాళ్లకు తామే గొప్ప అన్నట్టు తమ కార్యక్రమం ఉండేలా అన్ని సిద్ధం చేసుకుని వేడుకను చేసుకుంటారు.

అయితే ఎటువంటి ఆర్భాటం లేకుండా తన కుమార్తె పుట్టినరోజుకు ఏదో ఒక మంచి కార్యక్రమం చేయాలి అని ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆలోచన ఎందరికో స్ఫూర్తిదాయకంగా ఉంది. జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న ఉద్యోగం చేస్తున్న మండలంలోని పాముల వారి గూడెం గ్రామానికి చెందిన కూరం ప్రసాద్ తన ద్వితీయ కుమార్తె దీప్తి ఫ్లోరెన్స్ పుట్టినరోజును



జంగారెడ్డిగూడెం లోని వృద్ధులు దివ్యాంగుల నడుమ ఎంతో ఆర్భాటంగా చేశారు. పుట్టినరోజు వేడుక అంటే పదిమందికి ఆదర్శంగా ఉండాలని తన కుటుంబ సభ్యులు కూరం ప్రసాద్ భార్య రామలక్ష్మి కుమార్తె దీప్తి ఫ్లోరెన్స్ ఆలోచనతో జంగారెడ్డిగూడెంలోని అమ్మానాన్న వికలాంగుల సేవా సంస్థ నందు పుట్టినరోజు వేడుకలు నిరాడం బరంగా కేక్ కట్ చేసి ఆ పెద్దల సమక్షంలో జరుపుకున్నారు. వృద్ధులు దివ్యాంగులకు పళ్ళ స్వీట్స్ అందించారు. అలాగే భోజన వసతులకు కావలసిన 26 కేజీల బియ్యం బస్తా అందించారు. అంతేకాకుండా అమ్మ నాన్న సేవా సంస్థ ఆశ్రమం రేకులకు చిల్లులు పడి వర్షం పడుతుందని తెలుసుకున్న ప్రసాద్ రామలక్ష్మి దంపతులు తక్షణమే ఆశ్రమానికి కావలసిన రేకులను తొమ్మిది వేల రూపాయలతో కొన్ని ఇచ్చారు. కుమార్తె పుట్టినరోజును అమ్మానాన్న సేవా సంస్థ ఆశ్రమంలో జరుపుకోవడమే కాకుండా వారికి చేదోడు వాదోడుగా ఉన్న కూరం ప్రసాద్ రామలక్ష్మి దంపతులను వృద్ధులు దివ్యాంగులు నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవిస్తూ పదిమందికి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని అలాగే దీప్తి ఫ్లోరెన్స్ మంచి ఉన్నత స్థానానికి ఎదగాలని దీవించారు.

## 2016 దివ్యాంగుల హక్కుల చట్టం పై అవగాహన సదస్సు



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక దొండపాడు నందు గల ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిం చబడుతున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం శనివారం ఎం.ఈ.ఓ. ఆఫీస్ ఏలూరు నందు జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో "2016 దివ్యాంగుల హక్కుల చట్టం" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు అల్లూరి రవి ప్రకాష్ వి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.సంస్థ కో– ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని, డి.డి.ఆర్.సి.కేంద్రం ద్వార క్యాంపులు నిర్వహించి దివ్యాంగుల గుర్తిం పునకు సర్వేలు చేయటం జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం నందు ఫిజియోథెరపీ , ఆడియోలాజి, సైకలాజి సేవలు ఉచితంగా అందిస్తామని తెలియచేసారు. మరింత సమాచారం కొరకు 08812 –249297, 7386565469 నెంబర్‌కి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ పి.కమల హాసన్, ఎం.వహీదా బేగం, హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు వెళ్ళొచ్చేసరికి బంగారం,వెండి చోరీ



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు రూరల్‌లోని ద్వార కానగర్‌లో సొంటి వెంకట సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కుటుంబంతో కలిసి ఉంటు న్నాడు. ఈనెల 27వ తేదీన విజయవాడలో ఓ వివాహ వేడుకకు కుటుంబంతో కలి సి విజయ వాడ వెళ్ళాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకుని చూసే సరికి ఇంట్లో బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. రూరల్ ఎస్సై నాగబాబు వివరాలు సేకరించారు. 3.5 కాసుల బంగారం, వెండి ఆభరణాలు,25 వేల నగదు పోయినట్లు సుబ్రమణ్యం ఫిర్యాదులో పేర్కొన్నారు.

# విద్యార్థి దశ నుండే విలువలు నేర్చుకోవాలి

– యోగ గురువు వంగవీటి పుష్పవల్లి

**నరసాపురం,మేజర్ న్యూస్** : విద్యార్థి దశ నుండే విలువలు నేర్చుకోవాలని, చదువుపట్ల శ్రద్ధ చూపిస్తే జ్ఞానం వలన ధైర్యం వస్తుందని ప్రఖ్యాత యోగ గురువు వంగవీటి పుష్పవల్లి అన్నారు. చిట్టవరం గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాయల్ వశిష్ఠ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహింన వ్యక్తిత్వ వికాసం పై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశనుంచే వ్యక్తిత్వ వికాశాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎన్ కళాశాల హెచ్ ఆర్‌డి సెంటర్ కన్వీనర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, విశ్రాంత శాస్త్రవేత్త రంగినీడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులపట్ల, గురువుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, నిజమైన హీరోలు మన తల్లిదండ్రులేనని విద్యార్థులను చైతన్య పరిచారు. అనంతరం రాయల్ వశిష్ఠక్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి, గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మణరావు, గ్రామానికి చెందిన వశిష్ఠ రాయల్‌క్లబ్ సభ్యుడు గ్రంధి శ్రీనివాస్ తదితరులు వ్యక్తిత్వ వికాశ నిపుణులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ బొక్కా నాగరాజు, పులి భుజంగరావు, దేవిరెడ్డి ధర్మారావు, కొప్పినేని కుమార్, తాడి లక్ష్మణరావు, తోట శ్రీధర్, ఆరేటి మృత్యుంజయరావు, పోలిశెట్టి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## స్వదేశీ వస్తువులను వినియోగిస్తానని - నా ప్రతిజ్ఞ

– ప్రారంభించిన శాసనసభ్యులు చిర్రి బాలరాజు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్** : స్వదేశీ వస్తువులనే వినియోగించి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దామని పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు పిలుపు నిచ్చారు. శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వదేశీ వస్తువులనే వినియోగిస్తానని నా ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని శాసనసభ్యులు చిర్రి బాలరాజు బిజెపి నాయకులతో కలిసి బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తుల వినియోగం దేశీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కీలకమని ప్రతి పౌరుడు స్వదేశీ వస్తువులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొరగం వెంకటలక్ష్మి, కరిబండి నాగరాజు, కొండపల్లి ప్రసాద్, గుజ్జు ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షుడు గుడ్ల రాంబాబు, బాలు వీరంకి, కక్కిరాల మురళి,తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ



**కుక్కునూర్,మేజర్ న్యూస్** : జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం కుక్కునూరు మండలంలోని అన్ని శాఖల అధికారులు సమాచార హక్కు చట్టం 2005 న ప్రారంభమై ఇప్పటికి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తాసిల్దార్ రమేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించటం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం అనేది ప్రతి పౌరుడు హక్కు అని ప్రజలకు ఏశాఖలపై నైనా సమాచారం కావలసినప్పుడు ఆ శాఖలకు సంబంధించిన అధికారులకు సమాచార హక్కు చట్టం 2005 ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే 30 రోజులలో ఆ దరఖాస్తు దారునకి వారు అడిగిన సమాచారం ఇవ్వడం జరుగుతుందని అందువల్ల ప్రజలు ఈ అవకాశాన్ని మంచిగా ఉపయోగించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు సాయి రామకృష్ణ పంచాయతీ శాఖ అధికారులు రమేష్ నాగ దుర్గ వరప్రసాద్ వెంకటరమణ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌పాలెం హై స్కూల్లో ఎగ్జిబిషన్



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని యర్రంశెట్టివారిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక పరికరములు, వ్యవసాయం సోలార్ అర్బన్ రూరల్ ఇల్లు నమూనా నిర్మాణము వివిధ రకముల వైజ్ఞానిక పరికరములు ఎగ్జిబిషన్‌ను సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను నాగ ముఖ్యమాంబ,బాబులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెడ్ మాస్టారు కులపతి శ్రీనివాసరావు, సుబ్బారావు హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి నుండి వైయన్ కళాశాలలో వాలీబాల్ పోటీలు

**నర్సాపురం,మేజర్ న్యూస్** : ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాకినాడ పరిధిలోని అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 30 నుండి డిసెంబర్ 2 వరకు వైయన్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి వారం రోజులపాటు శిక్షణ ఇచ్చిన అనంతరం యూనివర్సిటీ తరపున జరిగే పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమం నిర్వహణకు అవకాశం ఇచ్చిన యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగానికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# మార్చి 12వ తేదీన బలుసులమ్మ జాతర





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారికి వచ్చే ఏడాది మార్చి 12వ తేదీ నుంచి జాతర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం తాడేపల్లిగూడెం బలుసులమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత 2014లో బలుసులమ్మ వారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. నాడు ఈవని రామచంద్ర ఘనాపాటి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ గాను, ఎమ్మెల్యేగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తిరిగి మార్చి 12 నుంచి 15 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించ తలపెట్టినట్లు వివరించారు.

22వ తేదీన నివేదనలు, 27న మహా కుంభాభిషేక కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిగూడెం ఆడపడుచులు పండుగ వాతావరణంలో జాతరను నిర్వహించేందుకు కనివినీ ఎరుగని రీతిలో ఏర్పాటు చేస్తామన్నారు. జాతర కమిటీలు అందరిని భాగస్వాములను చేస్తామన్నారు.

రామచంద్ర ఘనాపాటి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఆలయ చైర్మన్ శ్రీరంగ అంజి,ఆకాశపు స్వామి,జనసేన పార్టీ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి తదితరులు మాట్లాడారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహించ తలపెట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆటల పోటీలు మండల కేంద్రమైన ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శనివారం నిర్వహించినట్లు ఎంఈవో శిలారపు హేబేలు,కొవ్వలి ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు హేబేలు,ఆనంద్ కుమార్,జడ్పీహెచ్ఎస్ ఆగిరిపల్లి ప్రధానో పాధ్యాయిని పులి పుష్పలత ప్రారంభించారు. ఈ ఆటల పోటీలలో మండలంలోని వివిధ పాఠశాల నుంచి హాజరైన పురుష ఉపాధ్యాయులతో క్రికెట్, మహిళా ఉపాధ్యాయునులతో త్రోబాల్ ఆటలను ఆడించి, డివిజనల్ లెవల్ కు అర్హత కలిగిన వారిని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను ఉద్దేశించి డిసెంబర్ 13, 14 తేదీలలో డివిజనల్ స్థాయిలో జరిగే పోటీలలో సత్తా చాటి ఆగిరిపల్లి మండలానికి మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాశాఖ అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈదులగూడెం ప్రధానోపా ధ్యాయులు తాడి ప్రసాద్ అడవినెక్కలం ప్రధానోపాధ్యా యులు, పివి రమణ, ఆటల పోటీల మండల కోఆర్డినేటర్ ఎన్ శివ నాగేంద్రరావు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ సుగుణరావు, పిశిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్, నాగేశ్వరరావు, హర్ష, ఉమామహేశ్వరి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ క్రీడాపోటీలు ప్రారంభం



**పెదవేగి,మేజర్ న్యూస్:** మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని పెదవేగి ఎంఈవో -2 వి.అరుణ కుమార్ అన్నారు. ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన రెండురోజుల క్రీడాపోటీలు పెదవేగి మండలం విజయరాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు.

ఈపోటీలను ప్రారంభించిన ఎంఈవో -2 అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిత్యం భోదనే పరమావధిగా ఉండే ఉపాధ్యాయులకు ఈక్రీడాపోటీలలో ప్రశాంతత కలుగుతుందన్నారు. ఉపాధ్యాయుల మానసిక,శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు స్వాంతన చేకూరేలా క్రీడాపోటీలను ఏర్పాటు చేశారని చెప్పారు.

ఉపాధ్యాయులంతా ఈ క్రీడాపోటీల్లో పాల్గొని, ప్రతిభతో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. శ్రీనివాస్,రమేష్,రమణ,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లిలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పర్యటన



**అనకాపల్లి / నర్సాపురం,మేజర్ న్యూస్ :** అనకాపల్లిజిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామంలో మత్స్యకారులతో రాష్ట్రమత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన తెలిపారు. జెట్టి నిర్మాణం , చేపలను స్టోర్ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్, డీజిల్ సబ్సిడీ,మత్స్యకార 101 బోట్లకు మత్స్యకార కార్డులు,100 తెప్పలు కావాలి అని అడిగారు. భారీ వర్షాల సమయంలో ఉండటానికి తుపాను భవనం కావాలి అని, గ్రామంలో లైట్ హౌస్ ఉపాధి కల్పించాలని తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. మీరు తీసుకువచ్చిన ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, రాష్ట్ర అగ్నికుల క్షేత్రియ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ కృష్ణ, మత్స్యకర సంగం ప్రెసిడెంట్ కవురు పెద్దముత్యాలు, రాష్ట్ర మత్స్యకర సాధికార కమిటీ సభ్యుడు కొవ్విరి ధనరాజు, పార్టీ ప్రెసిడెంట్ కవూరి హరి కృష్ణ ఎంపీటీసీ అర్జిలి దేవి రవి, టీడీపీ అధ్యక్షుడు చింతకాయల చిన్నారావు, ఐటీడీపి సోషల్ మీడియా ఇంచార్జ్ చింతకాయల మహేష్, ఎక్స ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**టి.నరసాపురం,మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసు కోవాలని టి.నరసాపురం సొసైటీ చైర్ పర్సన్ జోనుబోయిన సోంబాబు అన్నారు. మండల కేంద్రమైన టి.నరసాపురం సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ గోడౌన్‌లో రైతు సేవా కేంద్రం ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోస పోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పండించిన ధాన్యాన్ని అమ్మడం శ్రేయస్కరమని అన్నారు. నాణ్యమైన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్ మెంబర్లు మోదుగు రామారావు, ఊజూరి నాగమణి,రాచబంటువేములయ్య,కొనకళ్ళ మోహన్, పెద్దిన సత్యనారాయణ,అద్దంకిజగ్గారావు,బై గాని వెంకటేశ్వర రావు, దొప్పసాని గోవర్ధన్, కిలారి సాంబశివరావు,రాజు,కొల్లి రమేష్, మురళి,సిబ్బంది పాల్గొన్నారు.

## సొసైటీలో ఎరువులు, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

### – ఛైర్మన్ ఘంటా మాధవరావు వెల్లడి



**కామవరపుకోట, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కామవరపుకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నట్టు సొసైటీ ఛైర్మన్ ఘంటా మాధవరావు తెలిపారు. తాను ఛైర్మన్ అయ్యాక సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల అమ్మకాలు తిరిగి ప్రారంభించామన్నారు. రైతులకు అవసరం అయిన యూరియా, డీఏపీ, 14 - 35, 20-20 అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే సొసైటీ వద్ద,రావికంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించామని.. రైతులు ఈ అవకాశం సద్వినియోగించు కోవాలని సూచించారు. సొసైటీ పరిధిలో ఉన్న ఏడు పంచాయతీల్లో మైక్ ద్వారా ఎరువుల అమ్మకాలపై ఎనౌన్స్‌మెంట్ చేయిస్తామని చెప్పారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎన్.ఎస్.ఎస్ అధికారి వసంత భాను




**పెనుగొండ ,మేజర్ న్యూస్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని ఎన్.ఎస్.ఎస్ అధికారి డాక్టర్ కె.వసంత భాను అన్నారు. రాజమహేంద్రవరం ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో గల వ్యవసాయ కళాశాల,విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమం పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో రెండో రోజు కొనసాగింది. దీనిలో భాగంగా స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సచివాలయ పరిసరాలు, వీధులు శుభ్రం చేశారు. స్వచ్ఛ్ భారత్ ర్యాలీ గ్రామంలో చేపట్టి, క్లీన్ అండ్ గ్రీన్ ఆవశ్యకతను తెలిపేలా అవగాహన నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రచారం చేశారు. అనంతరం గ్రామంలో డా. సి.హెచ్ సునీత ఆధ్వర్యంలో పెరటి తోటల పెంపకం మీద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ డా. కె. వసంతభాను ,పి.డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



– పనులు పరిశీలిస్తున్న దేశం నేత గొల్లు దుర్గాదేవి

నూజివీడు,మేజర్ న్యూస్ : నూజివీడు పురపాలక సంఘం పరిధిలోని 32 వ వార్డులో వందల మీటర్లు పొడవునా ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను నూజివీడు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు, మాజీ కౌన్సిలర్ గుళ్ళు దుర్గాదేవి సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో నూజివీడు పట్టణం 32వ వార్డులో తిరువూరు బస్టాండ్ ఏరియాలో గాంధీ కొట్టు నుండి ఆంజనేయస్వామి గుడి కూడలి సుమారు 200 మీటర్ల సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. రోడ్డు నిర్మాణమునకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను తొలగించి, సిమెంట్ రోడ్డు నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్లు దుర్గాదేవి మాట్లాడుతూ నూజివీడు పురపాలక సంఘాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి పార్థసారథి శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ, నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు మంత్రి కార్యాలయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ జాస్మిన్‌తో కలసి దుర్గాదేవి సిమెంట్ రోడ్డు పనులను పర్యవేక్షించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణమునకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను తొలగించడానికి వార్డు కార్యనిర్వాహక కార్యదర్శి దుబ్బిరెడ్డి నాగేంద్రరావు,వార్డ్ ప్రెసిడెంట్ వాకా రాంబాబు,వార్డు ప్రధాన కార్యదర్శి దుబ్బిరెడ్డి శ్రీనివాసరావు,రజక యూనియన్ ప్రెసిడెంట్ మన్మధరావు లు సహకరించారని, వీరికి దుర్గాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఆక్వా ఎక్స్పో సదస్సు




కైకలూరు, మేజర్ న్యూస్ : గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కైకలూరు సిఎన్ఆర్ గార్డెన్స్ నందు అక్వా ఎక్స్పో వారి ఆహ్వానంమేరకు వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ,సంకేతిక సదస్సులో పాల్గొని ఎగ్జిబిషన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుడివాడ మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వర రావు, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, దెందులూరు జనసేన ఇంచార్జి ఘంటసాల వెంకట లక్ష్మి, మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు,ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అక్వా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కవరంలో విజయకేతం పుస్తకాల పంపిణీ



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : మండలంలోని లక్కవరంలో జడ్పీ హైస్కూల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుకు లక్ష్యంగా రూపొందించిన "విజయకేత" పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మండల టిడిపి అధ్యక్షుడు కుక్కల మాధవరావు,గ్రామంలోని కూటమి నాయకులతో కలిసి పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ తో పాటు ఉపాధ్యాయులు టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గుండుగొలనులో శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి వితరణ



భీమడోలు,మేజర్ న్యూస్ : దాతల సహాయ సహకారాలతో దివ్యాంగుల అభివృద్ధికి గుండుగొలను శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి చేస్తున్న వితరణ కార్యక్రమాలు గొప్పవని ఏలూరుకు చెందిన జగపతి స్వామి అన్నారు. శనివారం భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 60 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలకు సంబంధించి సన్నబియ్యం, పండ్లు, దుప్పట్లు, భోజనాన్ని గ్రామానికి చెందిన దాత వగ్వాల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అందజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరుకు చెందిన జగపతి స్వామి, వగ్వాల రాంబాబు కుటుంబ సభ్యులు మాట్లాడు తూ శ్రీవిగ్నేశ్వర సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో వగ్వాల విమల, సురభి నాగవెంకట నారాయణ,వగ్వాల శ్రీరామ్మూర్తి, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, సినీ డైరెక్టర్ తోట రవి, అరసంకల సోములు, రావి గంగరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో విద్యార్థులకు దంత వైద్య శిబిరం



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం సూర్య డెంటల్ క్లినిక్ డాక్టర్ చామర్తి శివరాం కుమార్‌చే పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలందరికీ దంత పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తగు సూచనలు ఇవ్వడం జరిగింది.పాఠశాల ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థసారథి, రీజినల్ ఇంచార్జ్ ఉదయ్ భాస్కర్,అకాడమిక్ కో– ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు,పాఠశాల ఏవో కే శ్రీనివాసరావు, అకాడమిక్ డీన్ అస్గర్ అలీ,సి బ్యాచ్ ఇంచార్జ్ శివ సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటుంబాలు కలయిక మధ్య ఆనందోత్సవం



కైకలూరు,మేజర్ న్యూస్ : మాత స్కూలులో అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యల కుటుంబాల కలయిక సమావేశం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎందరో అమ్మమ్మలు నానమ్మలు తాతయ్యలు వారి మనవళ్లతో ఈ సమావేశంలో పాల్గొని ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూలులో ఏర్పాటుచేసిన మాతా కార్నివాల్ ఎక్స్పోకి అశేష ఆదరణ లభించింది మాత స్కూల్ తరపున ఈ స్కూల్ కి విచ్చేసిన అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యలు అందరికీ కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మాత స్కూల్ యాజమాన్యం,అధ్యాపక బృందం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడంతో పలువురు అభినందనలు తెలిపారు.

## ఉపాధ్యాయుల ఆటల పోటీలకు 23 మంది ఎంపిక



కామవరపుకోట ,మేజర్ న్యూస్: మండల స్థాయిలో జరిగిన ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో క్రికెట్ నుంచి 16 మంది ఉపాధ్యాయులు, త్రోబాల్ నుండి ఏడుగురు ఉపాధ్యాయినులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన పోటీల్లో ఎంఈవో 2 ప్రశాంత్ కుమార్, కామవరపుకోట హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు డివిఎస్ గవర్రాజు, కళ్ళచెరువు ప్రధానోపాధ్యాయులు కే జయశుభాకర్, కామవరపుకోట హైస్కూల్ పీడీ జి.శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ పెట్రోల్ బంక్ నిధుల దుర్వినియోగం దోషులను గుర్తించాలి




ఏలూరు,మేజర్ న్యూస్ : ఏలూరు ఆర్టీసీ డిపో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో జరిగిన రూ.83 లక్షల అవినీతిపై జ్యుడీషియల్ దర్యాప్తు జరిపి దోషులను గుర్తించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే,బి కే ఎం యు జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నలుగురు ఉద్యోగులపై ఆర్టీసీ యాజమాన్యం విధించిన అక్రమ సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్టీసీ గ్యారేజీ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి డాంగే సంఘీ భావం తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆర్టీసీ ఆయిల్ బంక్ నిర్వహణలో జరుగుతున్న లోపాలను గుర్తించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత 83 లక్షలు రూపాయల స్కాము పై సంపూర్ణ దర్యాప్తు జరపకుండా స్కామ్‌తో సంబంధం ఉందో? లేదో? తెలియకుండా నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయటం ఎంతవరకు సమంజసం యాజమాన్యమే తెలపాలన్నారు.ఏఐటియుసి అనుబంధం పట్టణ జట్లు లావురు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు ఆర్టీసీ జేఏసీ నాయకులు వై శ్రీనివాస్,టి కే రావు తదితరులు పాల్గొన్నారు. శనివారం దీక్షలో టి ఎస్ కే బాబు, వి ఆంజనేయులు, బి ఎన్ వి ప్రసాద్, వి వి రెడ్డి, ఐ హెచ్ రావు, ఏఎస్ రావు, టిడి చారి దీక్షలో పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణానికి రూ.82 లక్షలు మంజూరు



పాలకోడేరు,మేజర్ న్యూస్: గొరగనమూడి గ్రామంలోని సాఫ్వేర్ కంపెనీ నుంచి బైట్ ఇంజనీరింగ్ కళాశాల వరకు గల 120 మీటర్ల రహదారి నిర్మాణానికి నాబార్డ్ నిధుల నుంచి రూ.82 లక్షలు మంజూరు అయినట్లు సర్పంచ్ శివాజీ రాజు తెలిపారు. త్వరలోనే తారు రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుకు సిఫార్సు చేసిన శాసనసభ్యులు కనుమూరు రఘు రామకృష్ణం రాజుకు సర్పంచ్ శివాజీ రాజు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉండి జనసేన అధ్యక్షుడు జుత్తుగనాగరాజు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సిపిఎం నేత కుమారరత్నం సేవలు చిరస్మరణీయం



**యలమంచిలి, మేజర్ న్యూస్:** సిపిఎం పార్టీ తరుపున మాజీ ఎంపీటీసీగా పనిచేసిన ఏనుగువానిలంక గ్రామానికి చెందిన పాలపర్తి కుమార రత్నం ఆ గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి అన్నారు. ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరుడు పాలపర్తి కుమార రత్నం ఇంటి వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జార్జి తో పాటు కుమారురత్నం సమకాలీకులైనసిపిఎం సీనియర్ నేత మాసవరపు సుబ్బారావు మాట్లాడుతూ కుమార్ రత్నం సిపిఎం పార్టీలో సుమారు పాతిక సంవత్సరాలు పాటు కొనసాగడంతో పాటు ఒక పర్యాయం పార్టీ తరపున ఎంపీటీసీగా, సుమారు పాతిక సంవత్సరాలు పాటు పంచాయతీ వార్డు మెంబర్ గా పనిచేసి గ్రామంలో కుల మతాలకు అతీతంగా ఎవరికి ఏ సమస్యలు వచ్చినా ఒక పెద్ద తరహాగా ఉంటూ అదే గ్రామానికి చెందిన మరొక సిపిఎం సీనియర్ నేత దేవరపు గణపతి తో కలిసి ప్రతి సమస్యను తమదిగా భావించి ఆ సమస్య పరిష్కారం అయ్యేవరకు పట్టుదలతో కృషి చేయడంతో పాటు గ్రామ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు అధికారులతో పోట్లాడి మరి నిధులు రప్పించి గ్రామాభివృద్దే ధ్యేయంగా నిస్వార్ధంగా ఎనలేని సేవలు చేసి గ్రామ ప్రజల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గూడూరి ఆంజనేయులు, కొప్పిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి



**భీమవరం, మేజర్ న్యూస్:** భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు జిల్లాలో మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, రైతుల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ దిత్వ తుఫాను కారణంగా జిల్లాలో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు ఇప్పటికే కోసిన పంటను జాగ్రత్త చేసుకోవాలన్నారు. ధాన్యం నూర్పిడి అయితే వెంటనే ధాన్యం కొనుగోలు సెంటర్ల ద్వారా అమ్మకాలు చేయాలన్నారు. వరి కోతలను మూడు రోజులు పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో గోనె సంచులు కొరతలేదని, ఆర్ఎస్కే లలో సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1.12 లక్షల రైతులకు సంబంధించి 2.11 లక్షల ఎకరాల్లో పంట ఈ పంట నమోదు చేయడం జరిగిందని, సుమారు 6.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. దీనిలో స్థానిక వినియోగం, బహిరంగ మార్కెట్లో అమ్మకాల పోను 5.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనాలు ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్ కు 5.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. 215 ఆర్ఎస్కేల ద్వారా 17,640 మంది రైతుల నుండి నేటికి 1.32,453 మెట్రిక్ టన్నుల రూ.313.78 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, దీనిలో 297.19 కోట్ల నగదును రైతుల ఖాతాలలో 24 గంటల్లోపే జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 202 రైస్ మిల్లులు రూ.404 కోట్లు బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం 307 ధాన్యం కొనుగోలు సెంటర్లను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం 201 రైస్ మిల్లు ఉన్నాయని, మనకు 1.25 కోట్ల గోనే సంచులు అవసరం ఉన్నాయని తెలిపారు. పట్టుబడి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 3,100 వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తీర మండలాలు అయిన నరసాపురం, మొగల్తూరు, భీమవరం, పాలకొల్లు పరిసరాలలో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున సకాలంలో పొలములోని నీరు బయటకు పోవుటకు డ్రైనేజి ఏర్పాట్లు చేసుకోవాలని, గాలి వేగాలు పెరిగే అవకాశమున్నందున, గాలి వేగానికి వరి మొక్కలు వాలిపోయే అవకాశం ఉన్నందున ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో రైతులు వారి యొక్క ధాన్యం సురక్షిత ప్రదేశములకు తరలించుకోవలసినదిగాను మరియు వర్షం కురిసిన యెడల నీళ్ళు చొరబడకుండా టార్పాలిన్లు కప్పుకుని ధాన్యాన్ని భద్రపరచుకోవలసినదిగా తెలియజేసినారు. జిల్లాలో ఉన్న అన్నీ సొసైటీలలో దాదాపుగా 10,000 టార్పాలిన్లు ఉచిత ప్రాతిపదికన రైతుల అవసరాల నిమిత్తం కోతలు పూర్తి అయ్యి ధాన్యం ఆరబెడుతున్న రైతులకి అందుబాటులో ఉంచడం జరిగింది. ఎవరూ కూడా అకాల వర్షాల విషయములో ఎటువంటి పుకారులను, అవాస్తవాలను నమ్మవద్దని అలానే రైతులు వారి ధాన్యం విక్రయించుకోనుటకు ఎటువంటి దళారిల జోక్యం లేకుండా నేరుగా వారి సంబంధిత రైతు సేవా కేంద్రమును సంప్రదించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు, రవాణా, తూకం మొదలైన అంశాలపై ఏ సందేహాలైనా ఉంటే వెంటనే స్థానిక అధికారులను సంప్రదించాలని, క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉన్న యెడల జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన, ధాన్యం కంట్రోల్ రూమ్ నెంబర్లు 81216 76653, 1800 425 1291 లకు ఫోన్ చేసి నేరుగా సమస్యను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏ ఎస్ ఓ శివ శంకర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ కుమార్, జిల్లా రవాణా అధికారి కృష్ణారావు, జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తోపాటు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. మండలంలోని కోటరామచంద్రపురం ఐటీడీఏ వద్ద 2రోజులపాటు నిర్వహించే మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను పిఓ రాములు నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఓ రాములు నాయక్ మాట్లాడుతూ క్రీడలు ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొవాలని ఆయన సూచించారు. ఈ



కార్యక్రమంలో డివైఈవో ప్రసన్నకుమార్, ఎంఈఓ 2 నరేంద్ర రాయ్ తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక








**పాలకోడేరు,మేజర్ న్యూస్:** త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి అండర్ 14 నెట్ బాల్ పోటీలకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. శృంగావృక్షం గరగ తేజశ్రీ,గొరగనమూడి నుంచి పెనుమాల వసుంధర, తోలేరు నుంచి పెచ్చెట్టి బిందుశ్రీ మంజు ఎంపికయ్యారు వీరిని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణంరాజు అభినందించారు.

## సీఎం పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు : సీఐ రజిని కుమార్



**ఉంగుటూరు,మేజర్ న్యూస్:** డిసెంబర్ 1న ముఖ్యమంత్రి గొల్లగూడెం పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ మేరకు నిడమర్రు సీ ఐ రజని కుమార్ , చేబ్రోలు ఎస్సై మామిడాల సూర్య భగవాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు రైల్వే గేట్ నుండి దూబచర్ల అలాగే దూబచర్ల నుండి చేబ్రోలు మార్గంలో ప్రయాణించే భారీ వాహనాలు, గూడ్స్ వెహికల్స్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి ఉందన్నారు. సాధారణ పౌరులు, ద్విచక్ర వాహనాలు, ఆర్టిసి బస్సులు యధావిధిగా కొనసాగుతాయని సిఐ ఎస్ ఐ తెలిపారు.

## ఇరువురి మధ్య వివాదం - ఇద్దరికి తీవ్రగాయాలు

**పెదవేగి,మేజర్ న్యూస్:** సమీపంలో నివశించే ఇరువురి మధ్య జరిగిన కొట్లాటలో ఇరువురుకి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లికి చెందిన దొండపాటి మహేష్ కవ్వగుంటలో మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణానికి సమీపంలో నివశిస్తున్న కవ్వగుంటకు చెందిన మర్రి అనిల్కుమార్ ఇంటిలోకి తరచుగా తొంగిచూస్తున్నాడు. శుక్రవారం రాత్రికూడా ఇలాగే చూస్తుండగా గమనించిన అనిల్ కుమార్ రోజూ చాటుగా ఎందుకు చూస్తున్నావంటూ మహేష్ను ప్రశ్నించాడు. ఇద్దరిమధ్య మాటా మాటా పెరిగి, కొట్లాటకు దారి తీసింది. దీంతో అనిల్కుమార్ కత్తితో మహేష్పై విచక్షణారహితంగా దాడిచేశాడు. మహేష్ కూడా అనిల్పై దాడిచేశాడు. ఈ దాడిలో మహేష్ కుడి మోకాలు. భుజం. వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. అనిల్కుమార్ రెండు తొడలపై తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సం ఘటనపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇరువురిపై. పరస్పరం కేసులు నమోదు చేశామని ఎస్ఐఐ రామకృష్ణ తెలిపారు.

## జీవహింస విడనాడి సన్మార్గంలో నడవాలి : విద్యాసాగర్ స్వామీజీ



**పెనుగొండ, మేజర్ న్యూస్ :** మానవుడు ఎలా జీవించాలి అనే విషయాలను భగవద్గీత స్పష్టంగా తెలుపుతుందని విద్యాసాగర్ స్వామీజీ అన్నారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలో శ్రీ మందాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దశమి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాగోలుకు చెందిన విద్యాసాగర్ స్వామీజీ మాట్లాడుతూ సర్వమానవాళి జీవహింస విడనాడి సన్మార్గంలో నడవాలని గీతాశారాన్ని స్పష్టంగా తెలిపారు .కార్యక్రమంలో అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు , సత్సంగ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలు కూడా అవసరం



– శాసనసభా ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు

**పాలకోడేరు మేజర్ న్యూస్:** విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు చాలా అవసరం అని, ఉద్యోగ అన్వేషణలో కూడా క్రీడల సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని శాసనసభా ఉప సభాపతి కనుమూరు రఘు రామకృష్ణంరాజు అన్నారు.. పాలకోడేరు మండలం శృంగవృక్షం జిల్లా పరిషత్ హై స్కూల్ లో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల 69 వ స్కూల్ గేమ్స్ అండర్ 14 బాల బాలికల నెట్ బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగింపు సందర్భంగా బాలురలో 1ప్లేస్ విశాఖ 2ప్లేస్ తూర్పు గోదావరి 3ప్లేస్ పశ్చిమ గోదావరి బాలికల్లో 1ప్లేస్ విశాఖ 2 పశ్చిమగోదావరి 3 ప్లేస్ కృష్ణ జిల్లాల విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నారా లోకేష్ విద్యా శాఖా మంత్రి అయిన తర్వాత విద్యకు, క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మండలం లో కొన్ని స్కూళ్లకు ఆట స్థలాలు లేవని, త్వరలో స్థలాలను సేకరించడానికి ప్రయత్నిస్తామని అన్నారు.. శృంగవృక్షం హై స్కూల్ లో తెలుగుదేశం నాయకుడు కలిదిండి బుజ్జి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని అందుకు ఆయనకు అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉండి జనసేన పార్టీ అధ్యక్షులు జుత్తుగా నాగరాజు క్రీడల సంబంధిత అధికారులు పి ఇ టి లు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం కుమారుని వివాహం

– హాజరైన ఎంపీ పుట్టా మహేష్ ,ఎమ్మెల్యేలు చిర్రి,చింతమనేని,జ్యోతుల



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పవిత్ర వివాహ బంధంతో ఒకటైన నూతన దంపతులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. టి.నరసాపురం మండలం వీరభద్రవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు,పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు,సుజాత దంపతుల కుమారుడు సాయి వినయ్ వివాహము, పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామానికి చెందిన కట్టు బోయిన కృష్ణమోహన్, కృష్ణకుమారి దంపతుల కుమార్తె భాగ్యశ్రీ తో గురువారం రాత్రి వీర భద్రవరం గ్రామంలో వైభవంగా జరిగింది.ఈవివాహానికి హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించి,'మహేష్ అన్న పెళ్లికానుక' బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్,జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే పీతల సుజాత, పలువురు జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు ,సర్పంచ్లు, కూటమి నాయకులు,12వేల మందికి పైగా ప్రజలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** పంచారామ క్షేత్రమైన శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో హుండీలు శనివారం తెరిచి లెక్కించగా రూ.32, 64, 772లు భక్తుల సమర్పించిన డిగ్రీ ఆదాయంవచ్చిందని తెలిపారు,భీమవరం డివిజన్ ఇన్స్పెక్టర్ వద్దినీడి వెంకటేశ్వరరావు పాలకొల్లు టౌను ఎంఈఓ రంగరాజన్ దేవాలయంలో సిబ్బంది, రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లయర్స్, సేవా సమితి సభ్యులు దేవాలయం ధర్మకర్తలు చైర్మన్ మీసాల రామచంద్ర రావు , సూపర్డెంట్ వాసు ,ఇండియన్ బ్యాంక్ సిబ్బంది. ఆలయ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు,.

# ప్రజలను నట్టేట ముంచుతున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు







– సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు

**పెనుగొండ,మేజర్ న్యూస్:** సమస్యలు పెరుగుతున్నాయి, వాటికి వ్యతిరేకంగా ఉద్యోగ కార్మికులు కదలిక పెరిగిందని ఉద్యమాలు మరింత ప్రజలకు చేరుకోవాలని సిఐటియు జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రముఖ వైద్యులు విద్యావేత్త కలిదిండి రామచంద్రరాజు అన్నారు. శనివారం స్థానిక శ్రీలక్ష్మీ జనార్ధన స్వామి కళ్యాణ మండపంలో సిఐటియు జిల్లా 13వ మహాసభలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలో రామచంద్రరాజు మాట్లాడుతూ నేడున్న పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాల ఆవశ్యకత చాలా ఉందని ప్రజల భాగస్వామ్యం పెంచే విధంగా ఉద్యమాలు ఉండాలని ఆకాంక్షించారు.గ్రామ సర్పంచ్ సోనీ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు అంటే అవి అభివృద్ధికి దోహదపడేవేనని అభిప్రాయపడ్డారు. 13వ మహాసభకు అధ్యక్ష వర్గంగా బి. వాసుదేవ రావు,అజయ్ కుమారి,సిహెచ్ లక్ష్మి ,ఎం.సూరిబాబు ,జవ్వాది శ్రీనివాసు వ్యవహరించారు. మహాసభలో రాష్ట్ర నాయకులు వి. ఉమామహేశ్వరరావు, కే. ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మహాసభను ప్రారంభిస్తూ రానున్న కాలంలో సమరశీల ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగోలుగా లేబర్ కోడ్లు, రైతు నల్ల చట్టాలు, ప్రైవేటీకరణ వంటి విధానాలను అమలు చేస్తున్నాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి పాల్గొని ప్రసంగించారు. చట్టసభలలో ఉద్యోగులు కార్మికులు తరపున మాట్లాడటం జరుగుతుందని, ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళుతున్నామని అన్నారు. మహాసభ ప్రారంభంలో మహాసభల ప్రారంభ సూచికగా సిఐటియు పతాకాన్ని జిల్లా అధ్యక్షులు జెఎన్వి గోపాలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామేచూరి,ఆర్‌వీస్ చింతకాయల బాబురావు, అల్లూరి సత్యనారాయణ,షేక్ సాబ్జి, పొన్నాడ రాము తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి మహాసభ సంతాపం తెలిపింది. ఈ కార్యక్రమంలో పివి ప్రతాప్ కర్రీ నాగేశ్వరరావు,ఎం ఆంజనేయులు,డి.కళ్యాణి, ఎండి హసీనా,సూర్నీడి వెంకటేశ్వర రావు,డి.జ్యోతి ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

– మంత్రి పార్ధసారధికి ఏపి ఎంఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పోసి బాబు వినతి



**అమరావతి / జంగారెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఎపిఎంఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు చాట పర్తి పోసిబాబు ఆధ్వర్యంలో అమరావతి క్యాంపు కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా పోసిబాబు మాట్లాడుతూ 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని 3 రాష్ట్రాల్లో ఎస్టి జాబితాలో ఉన్నారని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు గంగేటి సంధ్యారాణి బందారు వెంకట ధర్మారావు దేవరకొండ రమాదేవి తుందుర్తి దుర్గారావు పెనుకుదురు సతీష్ చాటపర్తి శ్రీనివాస్ ( నంద) తదితరులు పాల్గొన్నారు.

## ఉపకారాగారాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి వరలక్ష్మి



**నరసాపురం, మేజర్ న్యూస్:** ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) ఆర్. వరలక్ష్మి శనివారం పట్టణములోని ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. జైలు ముద్దాయిలను కేసు వివరాలు , ఆరోగ్య పరిస్థితి, ఆహారం తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. జైలు ముద్దాయిలు పరివర్తనతో బయటికి వెళ్లాలన్నారు.ఆర్థిక స్తోమత లేనివారు అప్పీల్ చేసుకొనుటకు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టోర్ రూమ్, వంటశాలను పరిశీలించి, సరుకులు పురుగు పట్టకుండా శ్రద్ధ తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డి.నరసింహరాజు, ప్యానల్ న్యాయవాది, శిరీష, పి.ఎల్.వి బి.శ్యామ్ కుమార్ రాజీ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల సంక్షేమమే అంగన్వాడీల లక్ష్యం: సీడీపీవో విజయలక్ష్మి



**పెదవేగి,మేజర్ న్యూస్:** చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్వాడీ సిబ్బంది పనిచేయాలని పెదపాడు ఇన్చార్జ్ సీడీపీవో పాతిమా బేగం అన్నారు. పెదవేగిలో శనివారం జరిగిన అంగన్వాడీ పెదవేగి సెక్టార్ సమావేశంలో చిన్నారులలో ఆరోగ్య సంరక్షణ,పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్ళ నిండిన ప్రతి చిన్నారిని పూర్వ ప్రాథమిక విద్యకు సిద్ధం చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని. క్రమం తప్పకుండా పిల్లల ఎత్తు.బరువు సరిచూడాలని ఆమె తెలిపారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రతను పాటించాలని, గర్భవతులు, బాలింతల ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు చెప్పాలని వివరించారు. నిర్దేశించిన విధానంలో. చిన్నారులకు ఆహారం అందించాలని సీడీపీవో పాతిమా భాగం తెలిపారు.ఈ సమావేశంలో పెదవేగి సెక్టారు సూపర్వైజర్ సీహెచ్. పార్వతి. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.